


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



- 122 –

# రంగుల కల

**ఒక రంగుల కల** కళ్ళముందు ఆవిష్కృతమయ్యాక పెదవులపై చిరునవ్వు మెరిసింది. ఎడారంతా బంగారు రంగులో మెరిసి ఊరించింది.

తెలివిగా డబ్బు సంపాదించాలనుకుంది స్వప్న. బంగారం బిస్కట్లు కొనుగోలు చేసి ఇండియాకు తీసుకెళ్ళి అమ్మసాగింది. కొన్నాళ్ళు ఆ వ్యాపారం బాగా సాగింది. వచ్చిన లాభంతో కడపలో ఆస్తులు కొనసాగింది. మిద్దెలు, స్థలాలు, పొలాల కొనుగోలుకు లెక్కే లేదు.అలా కొన్ని కోట్ల ఆస్తిని సంపాదించింది స్వప్న. కొన్ని ఇంట్లో వాళ్ళ పేరుమీద పెట్టింది.

వీటన్నింటి అజమాయిషీ స్వప్న అక్కబావ చూడసాగారు. మితిమీరిన సంపద పోగవడంతో ఆమెలో అహం, గర్వం పెరిగాయి. ఏ పని చేసినా తనకు తిరుగు లేదనుకుంది. కువైట్ నుండి ఇండియా వచ్చే వాళ్ళందరి వద్దా ఎంతో కొంత బంగారం పంపేది. స్వప్న అక్కబావ మద్రాసు ఎయిర్ పోర్టుకు వచ్చి ఆ బంగారాన్ని తీసుకునేవారు.

మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగిన ఆ వ్యాపారం హఠాత్తుగా ఆగిపోయింది. ఇండియా ప్రభుత్వం పెద్ద మొత్తంలో బంగారాన్ని తేవడాన్ని బ్యాన్ చేసింది. ఒక పరిమితికి లోబడి తీసుకురావాలనే ఆంక్షలు విధించడంతో ఇక స్వప్న ఆటలు సాగలేదు.

అంతటితో తృప్తి చెంది వుంటే బావుండేది. కానీ స్వప్న ఆగలేదు. ఆమెలోని దురాశ దొంగ మార్గాలకు నడిపించింది. సాహసాలు చేయడానికి పురికొల్పింది. కువైట్ లో సారా కాచి అమ్మితే కోట్లు సంపాదించవచ్చు అనే ఆలోచనతో ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అనుకున్నదే ఆలశ్యం ఇండియా నుండి నలుగురు అబ్బాయిలను కువైట్ రప్పించింది.

పెద్ద ఇల్లు తీసుకుని అందులో సారా కాచి అమ్మే పని వారికి అప్పగించింది. కువైట్ లో ఆల్కహాల్ నిషేధం వుంది. మత్తు పదార్థాలు అమ్మరు. అందుకే వీళ్ళు కాచి చాటుగా అమ్మే సారాకు మంచి డిమాండ్ ఏర్పడింది.

మన ఇండియా వాళ్ళే సీసాలకు సీసాలు కొని తాగసాగారు. నలుగురు అబ్బాయిలకూ జీతం ఇవ్వగా మిగిలిన దినారాల గుట్టలు కట్టలు కట్టడానికే స్వప్న సమయం సరిపోయేది.

అలా ఒక సంవత్సరం గడిచింది. కువైట్ పోలీసుల కంట పడకుండా చాటుగా గుట్టుగా కాలం గడిచింది. దీంతో స్వప్నకు ధీమా పెరిగింది.

తనను ఎవరూ పట్టుకోరనే నిర్లక్ష్యం చోటు చేసుకుంది. డ్రమ్ములకు కాచి విచ్చలవిడిగా అమ్మసాగింది. ఇప్పుడు కువైట్ వాళ్ళు కూడా కొందరు కొని తాగసాగారు. ఇస్లాం మతాన్ని ఖచ్చితంగా పాటించేవాళ్ళు ఇలాంటివి వప్పుకోరు.

తెలిస్తే పర్యవసానం తీవ్రంగా వుంటుంది. ఏదో ఒకరోజు ఎవరో ఒకరి ద్వారా రహస్యం బయటపడక మానదు. తాగినవాడు వాగక మానడు. అలాంటి రోజును స్వప్న ఊహించలేదు. అదే ఆమె చేసిన తప్పు. అందుకే దానికి తగిన మూల్యం చెల్లించింది.

కొద్ది కాలం గడిచేటప్పటికి కష్టమంతా తమది. లాభం మొత్తం ఆమెది. కొన్ని దినారాలు మాత్రమే తమకు జీతమిచ్చి మిగతా మొత్తం దినారాలన్నీ దోచుకుని ఇండియాలో బిల్డింగులు కడుతోంది.

ఈ కువైట్ లో తమ చేత చట్ట వ్యతిరేకమైన పనులు చేయిస్తోంది. ఇది అన్యాయం అనే అసంతృప్తి నలుగురు కుర్రాళ్ళలో బయలుదేరింది.

స్వప్న లేని సమయంలో ఎక్కువగా సారా కాచి సిటీలోని ఏరియాలకు సరఫరా చేసి డబ్బును సంపాదించ సాగారు.

వచ్చిన డబ్బును నలుగురూ పంచుకునే వారు. అలా కొన్ని రోజులు గడిచింది. ఒకరోజు వాళ్ళు చేస్తున్న మోసం స్వప్నకు తెలిసిపోయింది. పోనీలే అని ఊరుకోలేదు.

మిమ్మల్ని ఇండియానుండి పిలిపించి పని చూపించి జీతం ఇస్తుంటే నా వ్యాపారానికే ఎసరు పెడతారా? ఎంత ధైర్యం అంటూ ఎడా పెడా కొట్టింది. వాళ్ళ దగ్గర వున్న డబ్బు లాక్కుని ఇంకోసారి ఇలాంటి పని చేసారంటే ఇండియాకు పంపిస్తాను అని బెదిరించింది. కుర్రాళ్ళు స్వప్నపై కక్ష పెంచుకున్నారు. అదను చూసి స్వప్నను గట్టి దెబ్బ కొట్టాలని నిర్ణయించుకున్నారు.

ఆ రోజు శుక్రవారం సెలవు కావడంతో నలుగురూ చికెన్, మటన్ తింటూ సారా తాగడం మొదలు పెట్టారు. నిషా బాగా తలకు ఎక్కాక స్వప్నను తిట్టడం ప్రారంభించారు.

ఏది ఏమైనా ఆమె చేసే వ్యాపారాన్ని పోలీసులకు చెప్పాలని స్వప్నను కువైట్ జైల్లో తొయ్యాలని ఆ విధంగా కోపాన్ని తీర్చుకోవాలని ఆశించారు.

వెంటనే వారిలో విజయ్ అనేవాడు ఫోన్ తీసుకుని పోలీసులకు కాల్ చేసి సార్ ఇక్కడ హవల్లిలో నాలుగో వీధి పదో ఇంట్లో సారా వుంది వచ్చి ఆ బిజినెస్ చేసే స్వప్నను పట్టుకోండి అని వాగేసాడు.

ఇంకేముంది.. పోలీసులకు పండగ అయింది.

ఒకరోజు అర్ధరాత్రి పూట మంచి సమయం చూసుకుని కువైట్ పోలీసులు చెకింగ్ కు వచ్చారు. ఇంటి మీద పడి అన్నీ చెల్లా చెదురు చేసారు. స్వప్న ఒక గదిలోకి చేరుకుని తన పలుకుబడిని ఉపయోగించాలని ఫోన్ లు చేయ సాగింది.

ఆ అవకాశం కూడా పోలీసులు ఇవ్వలేదు. సారాను సీజ్ చేసారు. సారా కాచే నలుగురు కుర్రాళ్ళను అరెస్ట్ చేసారు. స్వప్న వున్న గది తలుపును తట్టారు.

ఎంతగా పిలిచినా ఆమె తలుపు తీయలేదు. తలుపులు బద్దలు కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ లోపల గది వెనక ఉన్న మెట్ల గుండా మిద్దె పైకి చేరుకుంది స్వప్న. అది ఐదో ఫ్లోర్. పోలీసులు పైకి రాకుండా తలుపు బిగించింది.

పోలీసులు బిల్డింగ్ చుట్టూ మోహరించారు. అడకత్తెరలో పోక చెక్కలా తయారయ్యింది స్వప్న పరిస్థితి. నిముషాలు గంటలవుతున్నాయి. దాదాపూ మూడు గంటలు గడిచాక పోలీసులు ఆ తలుపును కూడా బద్దలు కొట్టసాగారు.

అప్పుడు భయమేసింది స్వప్నకు. ఏం చెయ్యాలి ఇప్పుడు? పోలీసులకు లొంగిపోవాలి లేదా బిల్డింగ్ పైనుండి దూకి పారిపోవాలి. ఐదో అంతస్తు నుండి దూకితే కాళ్ళూ చేతులూ విరగవా? ప్రాణం పోదా..? లొంగి పోవడమా!

అమ్మో కువైట్ పోలీసులు పెట్టే టార్చర్ గుర్తొస్తే కిందికి దూకడమే మేలనిపిస్తోంది. ఇక వేరే మార్గం లేదు. తప్పు చేస్తే అరబ్ దేశాల్లో శిక్షలు ఎంత కఠినంగా వుంటాయో స్వప్నకు బాగా తెలుసు.

ఒకవేళ తన ప్రాణం పోతే.. ఇంతకాలం తను చేసిన అక్రమ వ్యాపారాలు, సంపాదించిన ఆస్తులు గుర్తొచ్చాయి.

అవన్నీ ఎవరు తీసుకుంటారో? డబ్బు మీద ఆశతో ఇంత ముప్పు తరుముకు వచ్చే దాకా నిర్లక్ష్యం చేసింది. ప్రాణం మీదకు తెచ్చుకుంది. సంపాదించింది చాలని ముందే తృప్తి చెంది వుంటే బావుండేది.

చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదు. ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదు. ఎలాగైనా ఈ పోలీసులకు దొరక్కుండా తప్పించుకోవాలి.

చుట్టూ చూసింది. ఒక ప్రక్క నీళ్ళ పైపు కనిపించింది. దాన్ని పట్టుకుని కిందకి నేల పైకి జారితే పరిగెత్తి దూరంగా పారిపోవచ్చు. ఆ సమయంలో స్వప్నకు వేరే మార్గం దొరకలేదు. ఆలస్యం చేస్తే పోలీసులు వచ్చి పట్టుకుంటారు.

స్త్రీ అని కూడా చూడకుండా చావకొడతారు. అక్రమ సంపాదనతో తను గడిపిన విలాస జీవితం, వైభోగం గుర్తొచ్చాయి. చిటికె వేస్తే కుక్కపిల్లల్లా చుట్టూ తిరిగే పనివాళ్ళు, డబ్బుందని పొగిడిన బంధువులు కళ్ళముందు మెదిలారు.

పొరపాటు చేసింది. తప్పు ఎప్పటికీ ముప్పే అది నిప్పు అని గ్రహించలేకపోయింది. ఇప్పుడేంటి గతి?

వణికే చేతులతో పిట్టగోడను పట్టుకుని అవతలికి దాటింది. అంచు మీద కాళ్ళేసి పైపును పట్టుకుని కిందకి చూసింది. కళ్ళు తిరిగాయి. అమ్మో ఐదు అంతస్తుల కిందకి పైపు సాయంతో జారగలదా.

తప్పదు అనుకుంటూ పైపును ఆసరా చేసుకుని శరీరాన్ని జార్చింది. ఇంతలో "ఇదిగో ఇక్కడ వుంది. కిందకి వస్తోంది పట్టుకోండి" అంటూ పోలీసుల కేకలు వినిపించాయి.

అంతే... కిందకి చూసింది.

"పట్టుకోండి" అంటూ పోలీసులు పైపున్న వైపు పరిగెత్తుకుని వస్తున్నారు.

కళ్ళు తిరిగాయి. కాళ్ళు వణికాయి. పట్టు తప్పింది. అంతే.. దబ్బుమని నేల మీద పడింది స్వప్న. తరువాతేం జరిగిందో తనకి తెలియదు. కళ్ళు తెరిచేటప్పటికి హాస్పిటల్లో వుంది. వళ్ళంతా కట్లతో కదల్లేని పరిస్థితి. ఏం జరిగిందో గుర్తొచ్చింది.

అంత ఎత్తునుండి పడ్డాక కూడా బ్రతికే వుందా..? బాధగా కదిలింది.

"అదిగో స్పృహలో కొచ్చినట్లుంది."

ఎవరో అంటున్నారు.

"వచ్చి ఏం లాభం? తప్పుడు పనులు చేసి డబ్బు సంపాదించింది. ఎంతోమంది ఉసురు పోసుకుంది. అందుకు శిక్ష అనుభవించింది. రెండు కాళ్ళూ, ఒక చెయ్యి విరిగిపోయాయి.

బతుకంతా అవిటి బతుకే. ఆస్తులన్ని అనుభవిస్తుందా పాడా?"

నర్సులనుకుంటా.. మాటలు వినిపించాయి.

రెండు కాళ్ళూ, చెయ్యి విరిగాయా? కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

స్పృహలోకి రాగానే పోలీసులు వచ్చారు. బాగుంటే జీవిత కాలం జైల్లో పెట్టేవారు. కానీ దేవుడే ఆమెకు తగిన శిక్ష వేసాడు. ఇక ఇండియాకు పంపించేద్దాం అని నిర్ణయించారు.

పట్టుబడిన నలుగురు కుర్రాళ్ళను కూడా స్వప్నకు సహకరించినందుకు, సారా కాచి నేరం చేసినందుకు నాలుగేళ్ళు కువైట్ జైల్లో వుంచి ఇండియాకు పంపించారు

ఇండియాలో స్వప్న బ్రతుకు దుర్భరమయ్యింది. ఇప్పుడు ఆమె చక్రాల కుర్చీకి అంకితమయ్యింది. ఆమె అవసరాలు చూడటానికి మనిషి కావాలి.

ఆస్తులన్నీ అన్న వదినలు, అయినవాళ్ళూ పంచుకుని అనుభవిస్తున్నారు అవిటిదని స్వప్నను ఈసడించుకుంటూ ఇంత తిండి పెడుతున్నారు. పట్టు పరుపులపై పడుకుని నిద్రించిన సుఖం దినారాల కట్టలను లెక్కించిన భోగం శాశ్వతం కాలేదే?

గతమంతా గుర్తు చేసుకుంటే స్వప్నకు కలగా అనిపిస్తోంది. చివరికి రంగులన్నీ ఒలికిపోయి అలుక్కుపోయిన చిత్రంలా ఆమె మిగిలింది.

(మరోకథ వచ్చేనెలలో)

COMMENTS